### ప్రజాశ్రేయస్సు కోసం..



చరిత్రక సీతారాంబాగ్ శ్రీరామ మందిరంలో అక్టోబర్ 15 నుంచి నవంబర్ 27 వరకు నిర్వహించిన భారత భాగ్య సమృద్ధి యజ్ఞం శనివారం ముగిసింది. సోమవారం పూర్ణాహుతి కార్యక్రమానికి గవర్నర్ తమిళసై సౌందర రాజన్ హాజరై వేద పండితుల ఆశీస్సులు అందుకున్నారు. యజ్ఞం నిర్వాహకులు లత మా ఫౌండేషన్ చైర్‌పర్సన్ మాధవీలత కొంపెల్ల గవర్నర్‌ను సన్మానించారు. గవర్నర్ మాట్లాడుతూ.. యజ్ఞం సందర్శన సందర్భంగా తెలంగాణ ప్రజలందరూ ఆనందంగా ఉండాలని శివుడిని ప్రార్థించానన్నారు. వైద్యురాలైన మాధవీలత యజ్ఞం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టి. యమన్‌సింగ్, భక్తులు పాల్గొన్నారు. - అబిడ్స్, నవంబర్ 27

## గురునానక్ జయంతి వేడుకలు



గురునానక్ జయంతి సందర్భంగా సోమవారం విశాల్ దివన్ నిర్వహించారు. అఫ్జల్‌గంజ్, సికింద్రాబాద్ గురుద్వార ఆధ్వర్యంలో రాగి జాతాస్( మత గురువులు) ప్రవచనాలతో నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. హెల్త్ క్యాంపు, రక్త దాన శిబిరంలో భక్తులు పాల్గొన్నారు. ప్రబంధక్ కమిటీ నిర్వాహకులు బలదేవ్ సింగ్ బగ్గా, కుల్దీప్ సింగ్, జగన్‌మోహన్ సింగ్, హర్‌ప్రీత్ సింగ్, ఇందర్‌జిత్, రవీందర్, మంజీత్ సింగ్, గులాటిలు మాట్లాడుతూ.. 30 వేల మంది ప్రార్థనలో పాల్గొన్నారని, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టడంతో పాటు లంగర్ కార్యక్రమం నిర్వహించారు. - సుల్తాన్‌బజార్, నవంబర్ 27

## స్వతంత్ర మహిళా అభ్యర్థిపై దాడి.. అరెస్ట్

మెహిదీపట్నం, నవంబర్ 27 : ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి స్వతంత్ర మహిళా అభ్యర్థిపై దాడిచేసిన ఎంఐఎం నాయకులను సోమవారం ఆసిఫ్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వారికి స్టేషన్ బెయిల్ ఇచ్చారు. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. టోలీచౌకికి చెందిన అంజుమ్ బేగం నాంపల్లి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నది. ఆమె ఆదివారం మధ్యాహ్నం అఘాపురా మురాద్‌నగర్‌లో ఉండగా ఎంఐఎం నాయకులు మూసా తన అనుచరులతో కలిసి ఆమెపై దాడి చేశారు. ఆమె వద్ద నుంచి రూ.15 వేలు, సెల్‌ఫోన్‌ను లాక్కుని ఓ గదిలో బంధించారు. కొద్దిసేపటి తర్వాత అక్కడి నుంచి తప్పించుకున్న అంజుమ్ బేగం ఆసిఫ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగి విచారణ చేపట్టిన పోలీసులు అంజుమ్ బేగంను మూసా, సయ్యద్ సికందర్, మహ్మద్ అలీం, హాసిన్ బిన్ గఫూర్ దాడిచేసి కొట్టినట్లు గుర్తించారు. వీరిని సోమవారం అరెస్ట్ చేసి పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో ఉన్నది

## ఆనందన్ సేవలు చిరస్మరణీయం



కవి సంధ్య, దళిత రచయితల వేదిక ఆధ్వర్యంలో తెలుగు వర్సిటీ సమావేశ మందిరంలో తెలుగు వర్సిటీ విజ్ఞాన సర్వస్వ కేంద్రం పూర్వ సంచాలకులు ఆచార్య కొల్లాగుంట ఆనందన్ సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ చెల్లప్ప, సాహితీవేత్తలు డాక్టర్ కోయి కోటేశ్వరరావు, డాక్టర్ శిఖామణి, వాగ్గేయకారుడు మస్తాన్, సన్నిధానం నరసింహశర్మ, ఆచార్య జి.వి.రత్నాకర్ పాల్గొని ఆనందన్ కృషి, వ్యక్తిత్వాన్ని కొనియాడారు. - తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 27

## గురు విశ్వస్ఫూర్తి బోధనలు ఆచరించాలి



గురు విశ్వస్ఫూర్తి బోధనలు ఆచరణలో పెట్టాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రామలింగేశ్వరరావు అన్నారు. స్ఫూర్తి కుటుంబం తెలంగాణ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాసవీ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్తిక పౌర్ణమి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఆల్ ఇండియా రేడియో పూర్వ డైరెక్టర్ రాంబాబు, దూరదర్శన్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ ఓలేటి పార్వతీశం, ట్రస్టు సభ్యులు వెంకట్, రాజేశ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.
- తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 27

# పాతనగరంలో బీఆర్‌ఎస్‌కు విశేష ఆదరణ



గన్‌ఫౌండ్రి డివిజన్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి, పార్టీ నాయకులు సంతోష్ గుప్తా



దత్తాత్రేయనగర్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ వహీద్ అహ్మద్

అబిడ్స్, నవంబర్ 27 : గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి అన్నారు. సోమవారం బీఆర్‌ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్‌కు మద్దతుగా ఆయన పార్టీ నాయకులు సంతోష్ గుప్తా తో కలిసి డివిజన్ పరిధిలోని ఇంటింటికీ తిరిగి ప్రచారాన్ని నిర్వహించారు. శోభన్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చేపడుతున్న సంక్షేమ పథకాలు విజయానికి దోహదపడతాయన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారి మద్దతు కూడగడుతున్నట్లు పేర్కొన్నారు. బస్తీల్లో ప్రచారానికి వెళ్తున్న సమయంలో ప్రజలు ఆదరణ కనబరుస్తున్నారని తెలిపారు. ప్రజల ఆదరణతో గోషామహల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు సంతోష్‌గుప్తా మాట్లాడుతూ.. గోషామహల్‌లో తొమ్మిదిన్నర ఏండ్లలో అభివృద్ధి నిలిచిపోయిందని, దీంతో ప్రజలు బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టాలని కృతనిశ్చయంతో ఉన్నారని తెలిపారు.

### నందకిశోర్ వ్యాస్ విజయం ఖాయం..

గోషామహల్‌లో బీఆర్‌ఎస్ విజయం ఖాయమని పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి ఆర్. చలపతిరావు పేర్కొన్నారు. సోమవారం జాంబాగ్ డివిజన్ పరిధిలోని మురళీధర్‌బాగ్‌లో బీఆర్‌ఎస్ నాయకులు ఎస్. ధన్‌రాజ్‌తో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. చలపతిరావు మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తమ పార్టీ అభ్యర్థి విజయం సాధించిన వెంటనే నియోజకవర్గంలోని వాడవాడలా అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. ధన్‌రాజ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలు బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయానికి దోహదపడుతాయన్నారు. గోషామహల్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ వహీద్ అహ్మద్ కోరారు. ప్రచారంలో భాగంగా దత్తాత్రేయనగర్ డివిజన్‌లో అభ్యర్థి నందకిశోర్ వ్యాస్‌కు ఓటు వేయాలని కోరారు. వహీద్ అహ్మద్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపట్టారని అన్నారు. గోషామహల్‌లో విజయానికి సీఎం కేసీఆర్ చేపట్టిన పథకాలు దోహదపడతాయన్నారు.



మురళీధర్‌బాగ్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి చలపతిరావు

# ఎన్నికలు సజావుగా సాగేందుకు బందోబస్తు



అబిడ్స్, నవంబర్ 27 : ఎన్నికల నేపథ్యంలో గోషామహల్ నియోజకవర్గంలో సున్నితమైన ప్రదేశాలను గుర్తించి ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు నియోజకవర్గం నోడల్ అధికారి, గోషామహల్ ఏసీపీ కోట్ల వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం పోలింగ్ స్టేషన్లను సందర్శించి పోలీసు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సున్నిత ప్రదేశాల్లో కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 235 పోలింగ్‌స్టేషన్లకు గాను 19 మొబైల్ టీమ్‌లను ఏర్పాటు చేసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతల పరంగా ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక పెట్రోలింగ్ టీమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. 120 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన సందర్భంలో మొత్తం 69 కేసులను నమోదు చేశామని, వీటిలో ప్రధాన పార్టీలైన బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులు రాజాసింగ్, నందకిశోర్ వ్యాస్‌లపై రెండు కేసులు నమోదైనట్లు తెలిపారు. రూ. 14.39 కోట్ల నగదు, రూ. 19.91 కోట్ల విలువ చేసే బంగారం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు డబ్బు , వస్తువులు పంపిణీ చేయకుండా నిఘా ఏర్పాటు చేశామని, పెట్రోలింగ్ పార్టీలు ఆయా ప్రాంతాల్లో తిరుగుతూ పర్యవేక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్థానిక ప్రజలు తమ ప్రాంతాల్లో ఎవరైనా డబ్బు పంపిణీ చేస్తున్నట్లు తెలిస్తే సమాచారం అందజేయాలని కోరారు.



గోషామహల్ కాంగ్రెస్ అభ్యర్థి మొగిలి సునితారావు రోడ్ షో నిర్వహించి ప్రచారం చేపట్టారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తనకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. - అబిడ్స్, నవంబర్ 27

## ఆకట్టుకున్న రాకుమారి స్వయం వరం జానపద నాటకం



రసరంజని హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర సురభి జయచంద్ర వర్మ బృందంచే రాకుమారి స్వయంవరం జానపద నాటకం సోమవారం రవీంద్రభారతిలో ప్రదర్శించారు. కథ, సంగీతం, దర్శకత్వం సురభి జయచంద్రవర్మ, రచన నెల్లూరు సుబ్బు, నిర్వహణ ఆర్.హారిక వర్మ అందించారు. విక్రమార్కుడు.. బేతాళుడు కథల్లో భాగంగా అవంతి రాజ్యం రాజు విజయేంద్ర వర్మ అతడి ఏకైక కుమార్తె సుంగంధిని, సామాన్య పౌరుడైన మాధవుడు ప్రేమ కథతో ఆకట్టుకుంటుంది. - రవీంద్రభారతి, నవంబర్ 27

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



నర్తన రవళి, కళానృత్యనికేతన స్కూల్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ వార్షికోత్సవం సందర్భంగా రవీంద్రభారతిలోని ప్రధాన కళావేదికపై కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాట్య గురువు ప్రొఫెసర్ భాగవతుల సేతురామ్, కళానృత్యనికేతన్ డైరెక్టర్ డాక్టర్ బిందు విచ్చేశారు. కార్యక్రమంలో డా.రమాదేవి,డా.ఎస్.పి.భారతి, డాక్టర్ మామిడి హరికృష్ణ పాల్గొన్నారు.
- రవీంద్రభారతి, నవంబర్ 27

### సంగం రామచంద్రజీ మందిరంలో..



కార్తిక పౌర్ణమి సందర్భంగా లంగర్‌హౌస్ డివిజన్ బాపూఘాట్ సంగం రామచంద్రజీ మఠంలో సోమవారం భక్తులు సంగం నదిలో పుణ్యస్నానాలను ఆచరించి రాముడికి పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా రథాన్ని భక్తులు ఊరేగించారు. ఆలయ మఠాధిపతి రాహుల్ దాస్ బాబా రాముడి మూల విరాట్‌కు పూజలు చేసి భక్తులను ఆశీర్వదించారు. నాయకులు సిరుగుమల్లె రాజువస్తాద్, లింగారెడ్డి, భరత్, కోయల్‌కార్ గోవింద్‌రాజ్, ఆరెళ్ల జగదీశ్ యాదవ్, కోయల్ కార్ శ్రీనివాస్ , సుశీల్ కుమార్, రవి పాల్గొన్నారు. - మెహిదీపట్నం, నవంబర్ 27